కథ

# నిజంగా నిజం!

భీమమరాజు వెంకటరమణ

**రోజు ఉదయాన్నే నిద్రలేపి అప్పటికే ఆలస్యమైయిందంటూ హడావిడి చేస్తూ పాలకార్డు, సంచీ చేతికిచ్చి బయటకు తరిమే క్రిష్ణప్రసాదు భార్య సత్యశ్రీ ఆ రోజు అతనికి విరుద్ధంగా అంటే మృదువుగా లాలనగా నిద్ర లేపుతూ కనపడింది. చేతిలో పాల కార్డు లేదు సంచీ లేదు పైగా పెదవులపై చిరునవ్వు, చేతిలో ఘుమఘుమలాడే కాఫీ కప్పు.**

తనకు మంచం దిగకుండానే భార్య కాఫీ తెచ్చి ఇవ్వడం అనేది ఎప్పుడో పది సంవత్సరాల క్రితం పెళ్ళయిన కొత్తల్లో జరిగినట్లు అతనికి లీలగా గుర్తు. లేచి కూర్చొని ఆమె కళ్ళలోకి చూస్తూ కప్పు అందుకున్నాడు. ప్రొద్దుటే భక్తి పాటలకు బదులు రేడియోలో "నిన్న లేని అందమేదో నిదుర లేచెనెందుకో" అనే పాట ప్రస్తుత సన్నివేశాన్ని మరింత రక్తి కట్టిస్తున్నది.


ఇది కలా నిజమా! తన చేతిపై తనే గిచ్చుకున్నాడు, నిజమే! ఆమె వయ్యారం వలకబోస్తూ "త్వరగా లేచి తయారవ్వండి, మీకిష్టమని ఉప్మా పెసరట్టు చేస్తున్నాను" అంటూ లోపలికి వెళ్ళింది. ఆ మధ్య ఎప్పుడో ఒకసారి అదే ఉప్మా పెసరట్టు చెయ్యమని అడిగినప్పుడు "ఒక్క టిఫిన్ చెయ్యటానికే చిరాకు పుడుతున్నది ఉప్మా పెసరట్టు రెండెవరు చేస్తారు?" అని విసుక్కున్నట్లు అతనికి బాగా గుర్తు. ప్రసాదుకు జరుగుతున్నదేమిటో అర్థం కావడం లేదు. అకస్మాత్తుగా వచ్చిపడిన ఆనందం.


ప్రసాదు చిన్నగా బాత్రూమ్ వైపు నడిచాడు, అప్పుడే బయటకొస్తున్న చంటి అని పిలవబడే ఎనిమిదేళ్ళ శరత్ "నాన్నగారు! మీకు అడ్డం కాకూడదని ముందే లేచి స్నానం చేసేసా, మీరు వెళ్ళండి!" అన్నాడు. ప్రసాదు చెవిలో అమృతం పోసినట్లుంది. నాన్నగారు అని అచ్చు తెలుగులో వాడెప్పుడూ పిలిచింది లేదు, ప్రతిరోజూ బాత్రూం దగ్గర వాళ్ళిద్దరికి ఎప్పుడూ యుద్ధమే. పైగా క్రికెట్ బ్యాట్ కొనివ్వలేదని కొద్ది రోజులుగా చంటి రుసరుసలాడుతున్నాడు కూడా. అలాంటిది "ఇవాళ ఇంత సభ్యతగా మాట్లాడుతున్నాడేమిటి?" చేతిమీద మళ్ళీ గిచ్చుకున్నాడు ప్రసాదు... నిజమే!

తయారై డైనింగ్ టేబుల్ దగ్గరకు వచ్చి కూర్చోగానే సత్యశ్రీ వచ్చి ప్రేమగా ప్రక్కన కూర్చొని వేడి వేడి ఉప్మా పెసరట్టు ప్లేటు అతని ముందు పెట్టింది. ఆమె అలా దగ్గరుండి టిఫిన్ పెట్టేది కేవలం వాళ్ల బంధువులెవరైనా వచ్చినప్పుడు మాత్రమే. ఇక మామూలుగా అయితే తనే పెట్టుకొని తినడం లేదా ఒక్కోసారి తనే టిఫిన్ తయారు చేసుకొని మరీ పెట్టుకొని తినడం అతనికి అలవాటుగా మారిపోయింది.

ప్రసాదు ఆఫీసుకి బయలుదేరాడు. ఆమె కూడా వాకిలిదాకా వచ్చి టాటా చెబుతూ గోముగా చూస్తూ "సాయంత్రం త్వరగా వచ్చేస్తారు కదూ!" అన్న మాటలకు ప్రసాదుకు ఒళ్ళంతా విపరీతంగా పులకరించి అసలు ఆ రోజు ఆఫీసుకి వెళ్ళబుద్ధి కాలేదు. కానీ వెళ్ళక తప్పదు. ఎందుకంటే మేనేజరు చండశాసనుడు, నిముషం ఆలస్యం అయితే గుడ్లు మిటకరిస్తాడు. పెద్ద పెద్ద క్లాసులు తీసుకుంటాడు. అసలే రావలసిన ఇంక్రిమెంట్ తొక్కిపెట్టాడు కూడాను.

బస్సు స్టాండుకి వచ్చి నిలబడిన ప్రసాదుకి మరొక షాక్, అక్కడ అందరూ క్యూలో నిలబడి ఉన్నారు, భాగ్యనగరంలో అలా చూడటం కలలో మాట. సాధారణంగా ఎడమ వైపుకి వంగిపోతూ వచ్చే పదహారో నెంబరు బస్సు ఆ రోజు నిటారుగ వచ్చింది, అయోమయానందాలతో అందరితోపాటు బస్సు ఎక్కిన ప్రసాదుకి మరొక జెర్క్. అదేమంటే అతనికి సీటు దొరికింది. ఆ బస్సులో ఉదయం ఆఫీసు సమయంలో సీటు దొరకటంకంటే ఎం.ఎల్.సీ. సీటు సులభం. అమితానందంలో తేలిపోతున్న ప్రసాదుకి బస్సు కిటికీలో నుంచి చూస్తుంటే భవనాలు, యాడ్ బోర్డుల స్థానంలో కొండలు





చెట్లు సుందర దృశ్యాలు కనపడుతున్నాయి, ట్రాఫిక్ పొగకు బదులు అరేబియన్ పెర్ఫ్యూమ్‌ను ఆస్వాదిస్తున్నట్లుగా ఉంది.

***

కస్సు బుస్సు మేనేజరు ఆ రోజు అరగంట ఆలస్యమైనా ఏమీ అనలేదు సరికదా చిరునవ్వు చిందించాడు. తన సీటు వైపు చూసిన ప్రసాదుకు మరో విచిత్రం కనపడింది. తను కూర్చునే పాత కుర్చీ టేబుల్ స్థానంలో సరికొత్తవి ఏర్పాటు అయినాయి. అది సాంబారుపొడి, కారప్పొడి మార్కెటింగ్ చేసే ఆఫీసులా లేదు, సాఫ్ట్‌వేర్ కంపెనీలా ఉంది. "మొన్న శనివారంనాడు ఇలా లేదు, సోమవారం వచ్చేసరికి ఎన్ని మార్పులు చేసారు?"అని ఆశ్చర్యపడుతూ అటుగా చూసి నోరెళ్ళ పెట్టాడు.

ఎదురు సీటులో కూర్చున్నది మరెవరో కాదు, ఆఫీసులోని ఆడవాళ్ళందరికంటే అందగత్తెగా పిలువబడే కంప్యూటర్ ఆపరేటర్ మాయ. ఆమెను చూసినప్పుడల్లా "గొప్ప సినిమా హీరోయిన్ కావలసిన ఆమె విధి వక్రించి ఆ ఆఫీసులో చేరిందేమో అనిపిస్తుంటుంది ప్రసాదుకి. ఎక్కడో ప్రక్కగదిలో ఉన్న ఆమె సీటు తనకు ఎదురుగా ఏర్పాటు కావడమేమిటి? అంత అందాన్ని

> **ప్రసాదుకు తనసలు వేరే లోకంలో విహారిస్తున్నట్లుగా ఉంది, తనతో మాట్లాడుతున్న మనుషులందరూ తనకు అనుకూలంగా, తను చూస్తున్న పరిసరాలన్నీ అందంగా మారిపోతున్నాయి.**

రోజూ చూస్తూ పనిచెయ్యటం అంటే ఎంత అదృష్టం? ప్రసాదు ఎటు చూసినా అందం ఆనందం, అతన్ని వెంటాడి మరీ పరవశింపజేస్తున్నాయి. తట్టుకోలేని స్థితిలో చేతి మీద గిచ్చుకున్నాడు, కలకాదు... నిజమే.

కాసేపు ఆఫీసులో పని చేసాడో లేదో మేనేజర్ తన సీటు వద్దకు వచ్చి "కంగ్రాట్స్ మిస్టర్ ప్రసాద్! నీ ఇంక్రిమెంట్ కన్ఫరం అయింది, జీతం రెండు వేలు పెరుగుతుంది, రేపో మాపో ఆర్డర్స్ వస్తాయి" అని చెప్పి భుజం తట్టి వెళ్ళిపోయాడు.

అసలు భార్యకు తను లోకువైపోయింది కూడా ఈ ఎదుగు బొదుగు లేని జీతం వల్లనే. జీతం పెంచమని అడిగినప్పుడల్లా భంగపడటమే జరిగింది. ఇకపై కాలర్ ఎగరేసి తిరగొచ్చు.

వరుస క్రమంలో వస్తున్న ఆనందాశ్చర్యాలను పొడిగిస్తున్నట్లుగా ఎప్పుడు పిల్లికి బిచ్చం పెట్టని పిసినారి గుమాస్తా పాండురంగయ్య పుల్లారెడ్డి స్వీట్స్‌తో ప్రసాదు దగ్గరకు వచ్చి "ప్రసాదూ! ఇదుగో ఈ స్వీట్ పాకెట్ తీసుకో! ఇవాళ మా పెళ్ళిరోజు అన్నాడు కాస్త ఫోజు కొడుతూ. తన చెవులను, కళ్ళను నమ్మలేని స్థితిలో ఆ పాకెట్ తీసుకొని ఆయనకు థాంక్స్ చెప్పాడు.

ప్రసాదుకు తనసలు వేరేలోకంలో విహారిస్తున్నట్లుగా ఉంది, తనతో మాట్లాడుతున్న మనుషులందరూ తనకు అనుకూలం గా, తను చూస్తున్న పరిసరాలన్నీ అందం గా మారిపోతున్నాయి.

**(ముగింపు 17వ పేజీలో)**

### ఆదివారం క్విజ్

## సమాధానాలు

1. అరేబియా సముద్రం
2. ఇండియా
3. బెంగుళూరు
4. బిల్ గేట్స్
5. కేప్ టౌన్

# నిజంగా నిజం!

(7వ పేజీ తరువాయి)

ఆఫీసులో తను అసలు పని చేసాడో లేదో అన్నట్లు సమయం విచిత్రంగా గడిచి సాయంత్రం అయింది.

తన వైపే వస్తున్న మాయని చూసి నిలబడిపోయాడు ప్రసాదు. ఆమె సాధారణంగా ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడదు, దర్జా దర్పం కనబరుస్తుంటుంది, తన స్టేటస్‌కి తగినవాళ్ళెవరూ ఆ ఆఫీసులో లేరని ఆమె ఉద్దేశ్యం, అదృష్టం కలిసిరాక అక్కడ పని చేస్తున్నట్లు ఆమె ఫీలవడం అందరికీ తెలుసు. అలాంటి మాయ నడుచుకుంటూ తన దగ్గరకు వస్తున్నది.

"ప్రసాదుగారూ! ఇవాళ ఐమాక్స్‌లో సినిమా చూద్దామని రెండు టికెట్లు తెప్పించాను, ఇప్పుడు నా స్నేహితురాలు రావడం లేదు, ఎందుకనో మిమ్మల్ని పిలవాలనిపించింది, నాతో సినిమాకు వస్తారా? అడిగింది.

ప్రసాదుకి ఏదో భూకంపం వచ్చినంత వైబ్రేషన్, చెమటలు పట్టి కళ్ళు గిరగిర తిరిగి నోటమాట రాక తడారిపోయింది. విగ్రహంలా నిలుక్కుపోయాడు.

"ప్రసాదుగారూ! ఇంతకి వస్తున్నారా లేదా?" అంటూ మళ్ళీ అడిగింది. అతని ప్రమేయం లేకుండానే తల "సరే" అని అదే ఊపేసుకుంది. తేరుకోవడానికి అతనికి కాస్త సమయం పట్టింది.

వెనుక సీటులో మాయని కూర్చోబెట్టుకొని ఆమె స్కూటీని నడుపుతున్న ప్రసాదుకు పాత పౌరాణిక సినిమాల్లో నాయకీ నాయకుల్లా పాడుకుంటూ మబ్బుల్లో విహరిస్తున్నట్లుగా ఉంది, అక్కడక్కడా ట్రాఫిక్ జామ్ అవుతున్నా కూడా అతనికి తెలియడం లేదు, ముసిముసి నవ్వులతో బండి నడుపుతున్నాడు.

***

మాయతో రెండున్నర గంటలపాటు సినిమా చూడటం ఆ తరువాత రెస్టారెంట్‌లో అరగంట కూర్చోవటం ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది, కలో నిజమో అర్థంకాని పరిస్థితి. మరొకసారి చేతిమీద గిచ్చుకున్నాడు. కల కాదు నిజమే! ఇంటికి చేరేసరికి రాత్రి పది గంటలయింది. ఆలస్యం అయితే సత్యశ్రీ మండిపడటం సాధారణం. కానీ ఆ రోజు "ఏమిటండి ఆలస్యం అయింది ఆఫీసులో పని ఎక్కువైయిందా?", త్వరగా ఫ్రెష్ అయి రండి భోజనం వడ్డిస్తాను" అన్నది.

"సారీ సత్యా! ఇవాళ నా కొలీగ్ ఒకరు పార్టీ ఇస్తేను అక్కడే తినాల్సి వచ్చింది అన్నాడు కాస్త బెదురుతూ. మామూలుగా



అయితే ఇలాంటి సమయంలో "ఇప్పుడు వండింది ఏం చెయ్యమంటారు? స్నేహితులు కనబడితే ఇల్లు వాకిలి గుర్తు రావా? ఒక ఫోను చేసి చెప్పాలనే ఆలోచన కూడా రాదా?" అనే మాటలు వినపడేవి. కానీ అందుకు విరుద్ధంగా "అలాగా! పోనీలెండి! రేపు ఉదయం పనమ్మాయికి పెట్టేస్తాలే! మీరెళ్ళి పడుకోండి" అన్న మృదువైన పలుకులు వినవచ్చాయి. తన బెడ్‌రూంవైపు పోతూ మరొకసారి గిచ్చుకున్నాడు ప్రసాదు.

చిన్నగా మంచం మీద వాలిన ప్రసాదు "ఏమిటి? ఇవాళ ఇంత మధురంగా గడిచింది? ఎటు అడుగువేస్తే అటు ఆనందాశ్చర్యాలు వెంటాడాయి. రోజూ ఇలానే ఉంటే బావుండు" అనుకుంటున్న సమయంలో సత్యశ్రీ వచ్చి ప్రక్కన కూర్చుంది.

ఆ రోజు ఆమె చూపుల్లో ఎప్పుడూ లేనంత ఆకర్షణ! ప్రక్కనే ఉన్న రేడియో ఆన్ చేసాడు. "ఎంత హాయి ఈ రేయి ఎంత మధురమీ హాయి" పాట వస్తున్నది. చివరికి రేడియో కూడా తనకు అనుకూలంగా మారిపోయిందనుకుని మురిసిపోయాడు. ఎప్పుడూ లేనంత దర్జా కనబరుస్తూ కొంటెచూపులతో గుచ్చుతున్నట్లు భార్యని చూస్తూ ఆమె చెయ్యందుకున్నాడు.

తెల్లవారినా ఇంకా నిద్ర లేవని ప్రసాదు ముఖం మీద ఏదో చల్లగా పడుతున్నది. కళ్ళు తెరిచి చూసి అవాక్కయిపోయాడు. ఎదురుగా ఎవరీ దేవకన్య? కాదు తన మరదలు స్వప్న. "అమెరికా వెళ్ళి ఎంత అందంగా తయారయ్యింది?" తనలో తాను అనుకుంటున్నాడు.

"ఏమిటి బావా! తెల్లవారుఝామున వచ్చా, ఎప్పుడెప్పుడు నిద్ర లేస్తావా అని ఎదురుచూస్తున్నా, నీ కోసం ఏమి తెచ్చానో చూడు" అంటూ తను తెచ్చిన ఫ్రెంచ్ పెర్ఫ్యూమ్‌ని అతనిపై స్ప్రే చేస్తున్నది. ఆ పరిమళానికి మరింత మైమరచిపోతున్నాడు ప్రసాదు. "ఈ రోజు మరీ ఉల్లాసభరితంగా ప్రారంభం అయిందన్నమాట" అనుకుంటున్నాడు. ఆమె స్ప్రే చేస్తూనే ఉంది. "వద్దు ప్లీజ్! వద్దు! ఇక చాలు!" అని ముఖానికి చెయ్యి అడ్డం పెట్టుకున్నాడు.

కానీ ఈ సారి చేతుల మీద ఇంకాస్త ఎక్కువ మోతాదులో చల్లగా ఏదో పడుతున్నది. కళ్ళు తెరిచి తల విదిలించుకొని చూసుకున్నాడు. పెర్ఫ్యూమ్ కాదు నీళ్ళు, తల ఇంకా బాగా విదిలించి చూసాడు. ఎదురుగా ఉన్నది మరదలు స్వప్న కాదు, భార్య సత్యశ్రీ, కళ్ళలో చిరాకు చేతిలో నీళ్ళ గ్లాసు. "ఇంత మొద్దు నిద్ర ఏమిటీ? గంట ఏడయింది, లేచి త్వరగా వెళ్ళిరండి" అన్నది. ఆమె చేతిలో యధావిధిగా పాలకార్డు, సంచీ. ప్రసాదు తల గిరగిరా తిరిగింది. తమాయించుకొని అటూ ఇటూ చూసాడు. ఏమిటిది? కలా నిజమా? తనను తాను పరీక్షగా చూసుకున్నాడు, చెయ్యి మీద గిచ్చుకోవడానికి చూసాడు, కానీ అది అప్పటికే ఎర్రగా కందిపోయి ఉంది, "నిజమే! ఇది కలకాదు నిజం! మాయ, స్వప్న నిజం కాదు, సత్యశ్రీయే నిజంగా నిజం.

## రచయితలకు సూచనలు!

* మీ రచనలను కాగితాలకు ఒకవైపున మాత్రమే రాయాలి.
* జిరాక్స్ కాపీలను పరిశీలనకు స్వీకరించలేం.
* మీ రచనతోపాటు పూర్తి అడ్రసు రాయాలి. పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరిగా ఉండాలి.
* అనువాద రచనలకి మూల రచయిత అనుమతి పత్రం జతచేయాలి.
* మీ రచన ఇదివరకు ఎప్పుడూ, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదన్న హామీపత్రం జతపరచాలి.
* ప్రచురించని రచనల్ని తిరిగి పొందాలనుకునేవారు తగినంత పోస్టేజీ స్టాంపులు అంటించిన సెల్ఫ్ అడ్రసు కవరు విధిగా జతపరచాలి.
* రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్‌లో ఎలాంటి సంప్రదింపులకు తావులేదు.
* ఆరోగ్యకరమయిన హాస్య, వ్యంగ్య రచనలకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.
* మీ రచనలు పంపించవలసిన చిరునామా:

ఆదివారం వార్త

ఎడిటర్

'వార్త' తెలుగు దినపత్రిక

లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్ - 500 080